VC NEWS
# వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...
TELUGU DAILY NEWS
www.veguchukkanews.com
శుక్రవారం 29 మార్చి 2024
సంపుటి.01 సంచిక.233




## రాజకీయ ఒత్తిడితో
### న్యాయవ్యవస్థకు ముప్పు

న్యాయవ్యవస్థను దెబ్బతీసేందుకు ప్రయత్నాలు

రాజకీయ ప్రయోజనాలకై న్యాయ వ్యవస్థ పై ఒత్తిడి

సీజేఐకి సంచలన లేఖ రాసిన 600 మంది న్యాయవాదులు



# కారు దిగనున్న కేకే..

## బీఆర్ఎస్‌కు సీనియర్ నేత కె.కేశవరావు గుడ్‌బై

- బీఆర్ఎస్‌కు సీనియర్
- నేత కె.కేశవరావు గుడ్‌బై
- సోనియా సమక్షంలో కాంగ్రెస్‌లో చేరే అవకాశం
- రేపు కాంగ్రెస్‌లోకి కేకే కుమార్తె, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి
- హఠాత్తుగా వరంగల్ లోక్‌సభ బరి నుంచి తప్పుకున్న కడియం కావ్య
- కడియం శ్రీహరి, కావ్య కూడా త్వరలో కాంగ్రెస్‌లో చేరతారనే ప్రచారం..
- శ్రీహరి వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా పోటీ చేసే చాన్స్!
- వరుస నిష్క్రమణలతో
- గులాబీ దళంలో కలవరం

హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత బీఆర్ఎస్ నుంచి పలువురు కీలక నేతల నిష్క్రమణలు కొనసాగుతుండగా.. తాజాగా పార్టీ సెక్రెటరీ జనరల్, పార్లమెంటరీ పార్టీ నేత కె.కేశవ రావు (కేకే) కూడా అదే బాట పట్టారు. 'కాంగ్రెస్ పార్టీ నాకు సొంత ఇల్లు లాంటిది. నేను పుట్టింది, పెరిగింది కాంగ్రెస్‌లోనే. 53 ఏళ్లు కాంగ్రెస్ పార్టీ లోనే పని చేశా. ఆ పార్టీలోనే చనిపోవాలనుకుంటున్నా. తీర్థయాత్రలకు వెళ్లినవారు ఎప్పటికైనా ఇంటికే చేరతారు. 84 ఏళ్ల వయసులో నేను కూడా నా సొంత ఇల్లు కాంగ్రెస్‌లో చేరతా..' అని కేకే గురువా రం నాడిక్కడ మీడియాకు చెప్పారు. అంతకుముందు ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు తో కేకే ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీ అర్ధాంతరంగా ముగిసినట్లు సమాచారం కాగా..ఆ తర్వాత బంజారాహిల్స్ నివాసంలో ఆయన మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడారు.

**తెలంగాణ కోసం బీఆర్ఎస్‌లో చేరా**

'బీఆర్ఎస్‌లో నేను పని మిగతా 2లో

*భారత్ రాష్ట్ర సమితి పార్టీలో గురువారం రెండు కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. త్వరలో కాంగ్రెస్‌లో చేరనున్నట్టు ఆ పార్టీ సెక్రటరీ జనరల్, పార్లమెంటరీ పార్టీ నాయకుడు కె.కేశవరావు ప్రకటించారు. ఎప్పుడు చేరేది మూడు నాలుగురోజుల్లో వెల్లడిస్తానని తెలిపారు. కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ అపాయింట్‌మెంట్ ఖరారైన తర్వాత ఆమె సమక్షంలో కాంగ్రెస్‌లో చేరాలని కేశవరావు భావిస్తున్నట్లు తెలిసింది. మరోవైపు వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి బీఆర్ఎస్ తరపున పోటీ చేసేందుకు టికెట్ దక్కించుకున్న బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి కడియం శ్రీహరి కుమార్తె కడియం కావ్య హఠాత్తుగా బరి నుంచి తప్పుకున్నారు.ఈ మేరకు ఆమె బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు గురువారం రాత్రి లేఖ రాశారు. కాగా కడియం శ్రీహరి, కావ్య కూడా త్వరలో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్టు సమాచారం. కడియం శ్రీహరి వరంగల్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తారనే ప్రచారం జరుగుతోంది. కీలక నేతలు వరుసగా పార్టీకి గుడ్‌బై చెబుతుండటం, చివరకు టికెట్ దక్కించుకున్న వారు సైతం వేరే పార్టీలోకి వెళు తుండటం బీఆర్ఎస్‌లో కలకలం సృష్టిస్తోంది. కేకే కుమార్తె గద్వాల విజయలక్ష్మి కాంగ్రెస్‌లో చేరడం ఇప్పటికే ఖాయం కాగా.. ఇలా ఇద్దరు నేతలు దాదాపుగా ఒకే సమయంలో తమ కుమార్తెలతో సహా బీఆర్ఎస్‌ను వీడనుండటం ఆసక్తి రేకెత్తిస్తోంది.*





## బండి సంజయ్‌పై
# కేసు నమోదు
### బెదిరింపులకు లొంగేది లేదన్న బండి

**హైదరాబాద్:** మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో బండి సంజయ్ పై కేసు నమోదైంది. చెంగిచర్లలో పిట్టల బస్తి బాధితులను పరామర్శించడానికి బండి సంజయ్, అతని అనుచరులు రాగా, పోలీసులకు, బీజేపీ నాయకులకు మధ్య వాగ్వాదం, తోపులాట చోటు చేసుకుంది. తోపులాటలో కింద పడిన నాచారం సీఐ నందిశ్వర్ రెడ్డికి గాయాలయ్యాయి. సీఐ ఫిర్యాదుతో బండి సంజరుతో పాటు మరో పది మందిపై 332, 353, 143, 149 ఐపీసీ 3, 4పీడీపీపీఏ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంపై బండి సంజయ్ మండిపడ్డారు. ఇదేమనా పాక్‌లో ఉందా అని అన్నారు. కేసులకు బెదరింపులకు లొంగబోమని అన్నారు. ప్రజల పక్షాన పోరాడుతామని అన్నారు.

# పరిశ్రమలొస్తేనే ఉపాధి అవకాశాలు

- త్వరలో సెగ్మెంట్‌కు సిమెంట్ ఫ్యాక్టరీ
- కొడంగల్ భూముల ధరకు కోకాపేటంత పెరగాలె
- పట్టాభూములకు మాదిరిగా అసైన్డ్ ల్యాండ్స్ కూ పరిహారం
- అడ్డమోలె మెరువాలె.. ఆదర్శంగా నిలువాలె
- ముఖ్య నేతల సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి




# వేడెక్కిన తెలంగాణ

హైదరాబాద్: సూర్యుడి భగభగలతో రాష్ట్రం వేడెక్కింది. అనేక జిల్లాల్లో ఎండవేడికి ప్రజలు అల్లాడుతున్నారు. ప్రధానంగా ఉత్తర తెలంగాణ ఉడుకుతోంది. వారం రోజులుగా 40 డిగ్రీల సెల్సియస్ వద్ద ఉన్న ఉష్ణోగ్రతలు గురువారం నాటికి మరింత పెరిగాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా నిర్మల్ జిల్లా దస్తూరాబాద్‌లో 43.1 డిగ్రీలు నమోదైంది. ఈ ఏడాదికి ఇదే రాష్ట్రంలో నమోదైన అత్యధిక ఉష్ణోగ్రత. మొత్తం 11 జిల్లాల్లో 42.1 డిగ్రీలకుపైగా నమోదయినట్లు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, ప్రణాళిక సంస్థ నివేదికలో పేర్కొంది. శుక్ర, శని, ఆదివారాల్లోనూ ఎండల తీవ్రత కొనసాగుతుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. బుధవారం రాత్రి హైదరాబాద్, ఆదిలాబాద్‌లలో ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.




సూర్యుడి భగభగలతో రాష్ట్రం వేడెక్కింది. అనేక జిల్లాల్లో ఎండవేడికి ప్రజలు అల్లాడుతున్నారు. ప్రధానంగా ఉత్తర తెలంగాణ ఉడుకుతోంది. వారం రోజులుగా 40 డిగ్రీల సెల్సియస్ వద్ద ఉన్న ఉష్ణోగ్రతలు గురువారం నాటికి మరింత పెరిగాయి.

**నిర్మల్ జిల్లాలో అత్యధికంగా 43.1 డిగ్రీలు నమోదు**

**11 జిల్లాల్లో 42.1 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు**

**రానున్న మూడు రోజులూ తీవ్ర ఎండలే**

# సంకల్పం గొప్పదైతే విజయం సులభం.

## "సత్యశోధక్" ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య.

### పాఠశాల పూర్వ విద్యార్థిని మాలవత్ సుమలతకు ఘన సన్మానం.

వేగుచుక్క న్యూస్, సిరికొండ, మార్చి 28



విద్యార్థుల లక్ష్యం, సంకల్పం గొప్పదైతే విజయం సులభమౌతుందని, అందుకు పాఠశాల పూర్వ విద్యార్థిని మాలవత్ సుమలత చక్కని నిదర్శనం అని "సత్యశోధక్" ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య అన్నారు.పాఠశాల స్థాయిలో డాక్టర్ కావాలనే దృఢ సంకల్పం, పట్టుదల మాలవత్ సుమలత డాక్టర్ అయ్యేలా చేసిందని ఆయన పేర్కొన్నారు. మారుమూల పల్లెలో జన్మించి గ్రామీణ ప్రాంతంలో విద్యానభ్యసించి ప్రతిష్టాత్మకమైన వైద్య విద్య(MBBS)లో ప్రథమ శ్రేణి ఉత్తీర్ణత సాధించిన మాలవత్ సుమలతను గురువారం పాఠశాలలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ, సమాజంలో వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనది, అనారోగ్యులపట్ల అంకితభావం, మానవీయత, సేవాదృక్పతంతో చికిత్స చేసే వైద్యులు చిరస్మరణీయులని అన్నారు. ప్రస్తుత పరిస్థితులలో వైద్యం చాలా విలువైనదని, నైపుణ్యంతో కూడిన వైద్య విద్యకు చాలా ప్రాముఖ్యత వున్నదని, విద్యార్థులు వైద్య విద్యపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులు ఇలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకొని అనుకున్న లక్ష్యం కొరకు నిరంతరం క్రమశిక్షణ, పట్టుదలతో కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని తండ్రి విట్టల్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అదనపు కలెక్టర్.

వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, మార్చి 28



నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉన్న ధాన్యానికి ఎలాంటి తరుగు, కోతలు లేకుండా రైతుకు పూర్తి స్థాయిలో మద్దతు ధర దక్కేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఎడపల్లి మండల కేంద్రంలో ఐ.కే.పీ ఆధ్వర్యంలో నెలకొల్పిన కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. కొనుగోలు కేంద్రం వద్ద అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. గన్నీ బ్యాగులు, తేమ కొలిచే యంత్రాలు, వేయింగ్ మెషీన్లు సరిపడా అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. అధిక సంఖ్యలో హమాలీలను నియమించి, వెంటదివెంట ధాన్యం లోడింగ్, అన్ లోడింగ్ ప్రక్రియ జరిగేలా పక్కా ప్రణాళికతో పర్యవేక్షణ జరపాలని అన్నారు. ఆరుగాలం శ్రమించి పంట సాగు చేసిన అన్నదాతలు ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టపోకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రధానంగా ఎఫ్.ఏ.క్యూ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న ధాన్యానికి ఎలాంటి తరుగు లేకుండా రైతులు పూర్తి స్థాయిలో మద్దతు ధర పొందేలా చూడాలన్నారు. రైతులు కూడా బాగా ఆరబెట్టి శుభ్రపర్చిన ధాన్యాన్ని కేంద్రాలకు తేవాలని సూచించారు. దీనివల్ల ఎలాంటి తరుగు, కడ్తా లేకుండా పూర్తి మద్దతు ధర పొందవచ్చని అన్నారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చే రైతులకు అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ వెంట డీఆర్డీఓ సాయాగౌడ్, డీఎస్ఓ చంద్రప్రకాశ్, సివిల్ సప్లైస్ డీ.ఎం జగదీష్, జిల్లా సహకార శాఖ అధికారి సురేష్ కుమార్, స్థానిక అధికారులు, రైతులు ఉన్నారు.

# కారు దిగనున్న కేకే.. బీఆర్ఎస్‌కు సీనియర్ నేత కె.కేశవరావు గుడ్‌బై

చేసింది పదేళ్లు మాత్రమే. తెలంగాణ కోసమే బీఆర్ఎస్‌లో చేరా. కానీ కాంగ్రెస్ పార్టీయే తెలంగాణ ఇచ్చింది. నేను మొదటి సారి కాంగ్రెస్ రెండో ప్రాధాన్యత ఓట్లతోనే రాజ్యసభకు ఎన్నికయ్యా. ప్రస్తుతం నేను బీఆర్ఎస్‌కు ఇంకా రిజైన్ చేయలేదు. నా కూతురు చేరిన రోజే నేను కాంగ్రెస్‌లో చేరబోవడం లేదు. ఏ రోజు చేరేదీ తేదీ ఖరారు అయిన తర్వాత చెబుతా..' అని కేకే చెప్పారు.

**నేను బీఆర్ఎస్‌లో ఉండి చేసేదేమీ లేదు**

'కేసీఆర్ నాకు చాలా గౌరవం ఇచ్చారు. నాకు కూడా ఆయనపై గౌరవం ఉంది. బీఆర్ఎస్ నేతలు, కార్య కర్తలు బాగా సహకరించారు. కానీ సుదీర్ఘ కాలం కాంగ్రెస్‌లో పనిచేశా. పీసీసీ అధ్యక్ష పదవి మొదలు కొని రాజ్యసభ వరకు నాకు కాంగ్రెస్ ఎన్నో అవకా శాలు ఇచ్చింది. ప్రస్తుతం రాజకీయ చరమాంకంలో ఉన్న నేను బీఆర్ఎస్ పార్టీలో ఉండి కూడా చేసేదేమీ లేదు.కేసీఆర్‌కు కూడా ఇదే చెప్పా. బీఆర్ఎస్‌కు సంబంధించిన అంశాలపై కూడా ఆయనతో మాట్లాడా. కవిత అరెస్టుతో పాటు పార్టీ అంతర్గత అంశాలపైనా చర్చ జరిగింది. కవితను అక్రమంగా అరెస్టు చేశారు. బీఆర్ఎస్‌లోనే కొనసాగాలని అనుకుంటున్న నా కుమారుడు విప్లవ్ నిర్ణయం మంచిదే..' అని కేశవరావు అన్నారు.

**నేను మాత్రం పార్టీ మారను: విప్లవ్‌కుమార్**

పార్టీ మారే విషయంలో తన తండ్రి కేశవరావు, సోదరి విజయలక్ష్మి తీసుకునే నిర్ణయాలతో తనకు ఎలాంటి సంబంధం లేదని కేకే కుమారుడు విప్లవ్ కుమార్ అన్నారు. కాంగ్రెస్‌లో చేరే విషయంపై వారు స్పష్టత ఇచ్చిన తర్వాతే, దానిపై తన అభిప్రా యం వెల్లడిస్తానని చెప్పారు. తాను మాత్రం పార్టీ మారే ప్రసక్తే లేదని ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. తాను బీఆర్ఎస్‌కు గట్టి మద్దతుదారుడినని, కేసీఆర్ నాయకత్వంపై తనకు సంపూర్ణ విశ్వాసం ఉందని చెప్పారు. కేసీఆర్ ప్రభు త్వంలో విప్లవ్‌కుమార్ తెలంగాణ అర్బన్ ఫైనాన్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేయడం తెలిసిందే.

**కేకే నివాసానికి ఇంద్రకరణ్‌రెడ్డి**

కేసీఆర్‌తో భేటీ తర్వాత కేకే బంజారాహిల్స్ లోని తన నివాసానికి చేరుకున్నారు. ఆ తర్వాత మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే గడ్డం అరవింద్ రెడ్డి కేకేతో భేటీ అయ్యారు. ఇంద్రకరణ్‌రెడ్డి కూడా త్వరలో కాంగ్రెస్‌లో చేరడం దాదాపు ఖాయమైన నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది. కాగా ఇంద్రకరణ్‌రెడ్డి, అరవింద్‌రెడ్డితో పాటు కేకే కుమా ర్తె, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి ఈనెల 30న కాంగ్రెస్‌లో చేరనున్నట్లు సమాచారం.

**మీ కుటుంబానికి ఏం తక్కువ చేశా?: కేసీఆర్**

విశ్వసనీయ సమాచారం మేరకు.. కేసీఆర్‌తో జరిగిన భేటీలో బీఆర్ఎస్‌లో పరిస్థితులు, తాజా రాజకీయ పరిణామాలపై తన అభిప్రాయాలతో కూడిన ఓ నోట్‌ను కేకే అందజేశారు. ఈ సందర్భంగానే కేకేతో పాటు విజయలక్ష్మి పార్టీని వీడుతున్నారనే వార్తలు ప్రస్తావనకు వచ్చాయి. దీనిపై కేకే వివరణ ఇస్తూ.. రాజకీయంగా ఇదే తన చివరి ప్రయాణం అని, కాంగ్రెస్‌లోనే చనిపోతానని చెప్పారు.ఈ నేపథ్యంలోనే ఇటీవల ఓ యూ ట్యూబ్ చానెల్ ఇంటర్వ్యూలో కేకే వెల్లడించిన అభిప్రాయాలపై కేసీఆర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 'పదేళ్లు అధికారం, పదవులు అనుభవించి ఇప్పుడు పార్టీ మారడాన్ని ప్రజలు గమనిస్తారు. మీ ఆలోచన మానుకోండి. మీ కుటుంబానికి పార్టీ తక్కువేమీ చేయలేదు. మీకున్న రాజకీయ అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని పార్టీ సెక్రటరీ జనరల్ పదవితో పాటు రెండు పర్యాయాలు రాజ్యసభకు పంపించా.

మీ కుమారుడికి కార్పొరేషన్ పదవి ఇచ్చా.మీరు కోరిన మీదటే పార్టీలో ఎంతోమంది నిబద్ధత కలిగిన వారిని పక్కన పెట్టి మరీ మీ కూతురు విజయలక్ష్మికి గ్రేటర్ హైదరాబాద్ మేయర్ పదవి ఇచ్చాం. పార్లమెంటు ఎన్నికలు జరుగుతున్న కీలక సమయంలో పెద్దరికంతో వ్యవహరించాల్సింది పోయి మీడియాలో నాపైనా, పార్టీ నాయకులపైనా విమర్శలు చేయడం సరికాదు..' అంటూ కేసీఆర్ అసహనం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వీరి భేటీ అర్ధంతరంగా ముగిసిందని సమాచారం.

# రాజకీయ ఒత్తిడితో న్యాయవ్యవస్థకు ముప్పు

**న్యూఢిల్లీ:** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ కు దాదాపు 600 మంది ప్రముఖ న్యాయవాదులు సంచలన లేఖ రాశారు. తమను కొందరు వ్యక్తులు ఒత్తిళ్లకు గురి చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆ లేఖలో పేర్కొన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం తమపైన న్యాయ వ్యవస్థ పైనా ఒత్తిడి తెచ్చేందుకు వారు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దేశంలో ఎంతో శ్రేష్ఠమైన న్యాయవ్యవస్థను దెబ్బతీసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ మనన్ కుమార్ మిశ్రా సహా దేశంలోని దాదాపు 600 మంది న్యాయవాదులు సీజేఐ డీవై చంద్రచూడ్‌కు లేఖ రాశారు. కొందరు వ్యక్తులు పొలిటికల్ అజెండాతో తమ స్వార్థ ప్రయోజనాలు కోసమని న్యాయవ్యవస్థపై ఒత్తిడి తెచ్చి.. దాని పరువు తీయడానికి ప్రయత్నిస్తున్నారని ఆ లేఖలో వారు సీజేఐకి ఫిర్యాదు చేశారు. ఓ వర్గం న్యాయమూర్తులు తమని ప్రభావితం చేయడానికి ప్రయత్నిస్తున్నారని వారి పేర్లను ఎక్కడా వెల్లడించకుండా ఆరోపణలు చేశారు. కొందరు న్యాయవాదులు రాజకీయ నాయకులతో సన్నిహితంగా



ఉంటూ వారి కేసులు వాదిస్తున్న వారి తీర్పును ప్రభావితం చేయడానికి ఒత్తిళ్లకు గురిచేస్తున్నారని వారు ఆరోపించారు. తీర్పును వారికి అనుకూలంగా మార్చుకునేందుకు వారు రకరకాల మార్గాలను అనుసరిస్తున్నారని పేర్కొన్నారు. దీంతో కొన్ని సార్లు న్యాయమైన తీర్పు వెలువడే అవకాశం ఉండదని తెలిపారు. రాజకీయ నాయకులకు సంబంధించిన కేసుల విచారించే న్యాయవాదులను వారు టార్గెట్ చేస్తున్నారని తెలిపారు. కోర్టులపై ప్రజల్లో విశ్వాసం తగ్గించేందుకు వారు తీర్పులపై తప్పుడు కథనాలను సృష్టిస్తున్నారని వెల్లడించారు. న్యాయవాదులు వారికి అనుకూలమైన తీర్పును వెల్లడించకపోతే.. వెంటనే వారు బహిరంగంగా విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు.సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు ప్రచారం చేసి తీర్పును, న్యాయవాదులను ప్రభావితం చేస్తున్నారని పేర్కొన్నారు. కోర్టు తీర్పును ప్రభావితం చేసే ఇటువంటి ఒత్తిళ్లను తిప్పకొట్టాలని కోరారు. న్యాయస్థానాలు కోసం నిలబడాల్సిన సమయం ఆసన్నమైందని సూచించారు.

అయితే ఆ 600 మంది న్యాయవాదులు మార్చి 26న ఈ లేఖ రాసినట్లు సమాచారం.

# పరిశ్రమలొస్తేనే ఉపాధి అవకాశాలు

**కొడంగల్:** కొడంగల్ మరో కోకాపేట కావాలన్నదే తన లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆదర్శంగా కొడంగల్‌ను తీర్చిదిద్దుతానని ప్రకటించారు. అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా జరగాలంటే రైతులు భూములు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. మహబూబ్ నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎక్స్ అఫీషియో మెంబర్ హోదాలో కొడంగల్ లో ఆయన ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం ముఖ్యనేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కోకాపేటలో ఎకరం వంద కోట్లకు ఎందుకు పలికిందంటే అక్కడ అభివృద్ధి జరిగినందునే అన్నారు. కొడంగల్ లో భూముల ధరలు కూడా కోకాపేటంత పెరగాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. ఇందులో భాగంగానే అభివృద్ధికి బాటలు వేస్తున్నామని, కొడంగల్ ను అద్దమోలె మెరిపిద్దామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఆదర్శ నియోజకవర్గంగా కొడంగల్ ను నిలుపుదామని అన్నారు. పట్టా భూములకు ఎంత పరిహారం ఇస్తామో.. అసైన్డ్ ల్యాండ్స్ కు కూడా అంతే ఇస్తామని, ఈ విషయాన్ని తాను అధికారులకు చెప్పినట్టు సీఎం తెలిపారు. కొడంగల్ లో అభివృద్ధి జరగకపోవడంతోనే ప్రజలు తాండూరు, రాయిచూర్, పరిగి, హైదరాబాద్, మహబూబ్ నగర్ కు పోతునారని, ఇక్కడ అభివృద్ధి చేసుకుంటే ఆ పట్టణాల వాళ్లే మన దగ్గరకు వస్తారని అన్నారు. తనను కొడంగల్ ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారని, తాను రాకున్నా 33 వేల ఓట్ల మెజార్టీ ఇచ్చి గెలిపించి అసెంబ్లీకి పంపారని, ముఖ్యమంత్రిని అయి వచ్చానని అన్నారు. మనకు వచ్చిన అవకాశాన్ని ఈ ప్రాంత అభివృద్ధికి వినియోగిద్దామని చెప్పారు. నారాయణపేట?కొడంగల్ ఎత్తిపోతల ద్వారా లక్ష ఎకరాలకునీళ్లు ఇచ్చుకునే ప్రయత్నం జరుగుతుందన్నారు. కొడంగల్ ను అద్దమోలె మెరిసేలా తీర్చిదిద్దుదామని అన్నారు.

# ఇది కాంగ్రెస్ తెచ్చిన కరవు

**సిరిసిల్ల:** కాంగ్రెస్ పార్టీ నిర్లక్ష్య విధానాల వల్ల రైతులు ఆగమైపోతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో 15 నుంచి 20 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని చెప్పారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని కాంగ్రెస్ తెచ్చిన కరువన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సారంపల్లిలో ఇటీవల వడగండ్ల వానకు నష్టపోయిన పంటలను కేటీఆర్ పరిశీలించారు. పంటల నష్టంపై రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రైతుల్లో భరోసా నిపండానికి క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నామని తెలిపారు. డిసెంబర్ 9న రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ చెప్పిందని, ఇప్పటిరకు చేయలేదని విమర్శించారు.

రైతుబంధుకు కేసీఆర్ సర్కార్ రూ.7 వేల కోట్లు సిద్ధంచేసిందని, కానీ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి పంటసాయాన్ని ఆపిందని చెప్పారు. తాము రైతుల కోసం ఉంచిన డబ్బులను కాంగ్రెస్ పార్టీ కాంట్రాక్టర్లకు ఇచ్చిందన్నారు. కౌలు రైతులకు కూడా రైతుభరోసా ఇస్తామని రేవంత్ రెడ్డి చెప్పారని, చివరికి వారిని కూడా మోసం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మేడిగడ్డలో కుంగిన మూడు పిల్లర్లను రిపేర్ చేయడానికి రేవంత్ రెడ్డికి చేతకావడం లేదని విమర్శించారు.

# ఫోన్ ట్యాపింగ్‌పై సిబిఐ విచారణ

**హైదరాబాద్:** అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు భారాసను ఓడించి శిక్ష విధించినా ఆ పార్టీ నేతలు అహంకారాన్ని వీడటం లేదని భాజపా ఎంపీ లక్ష్మణ్ విమర్శించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నియంతృత్వాన్ని పాటించే వాళ్లు నీడను కూడా నమ్మరన్నారు. కేసీఆర్ కూడా ఎవరినీ నమ్మలేదని.. అందుకే రాజకీయ, మీడియా ప్రముఖులపై ఫోన్ ట్యాపింగ్ చేయించారని ఆరోపించారు. కేంద్ర హోం శాఖ అనుమతి లేకుండా ఫోన్ ట్యాపింగ్ చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో హార్డ్ డిస్కులు, సమాచారాన్ని ధ్వంసం చేశారు. రెండో, మూడో ఫోన్ ట్యాపింగ్‌లు జరిగితే జరగవచ్చని కేటీఆర్ అంటున్నారు. దీనికి మూల కారకులు కేసీఆర్, కేటీఆర్ అని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి దీనిపై సీబీఐ విచారణ చేయించాలన్నారు. మద్యం కుంభకోణంలో కవిత పాత్ర ఉంది. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకల్లో ఆ కుటుంబానికి ప్రమేయం ఉందన్నారు. తెలంగాణ సంపదను దోచకున్న వారికి శిక్ష పడాలని ప్రజలు కోరుకుంటున్నారు. సీఎంగా ఉన్నప్పుడు కేసీఆర్ ఫామ్ హౌస్ నుంచి కదలలేదు. సచివాలయానికి ఒక్కసారి కూడా వెళ్లలేదు. గత ప్రభుత్వంలో ప్రతి పథకంలో స్కామ్‌లు చేశారు.. కమిషన్లు తీసుకున్నారు. ప్రశ్నించే వారిని బెదిరింపులకు గురిచేశారు. నియంతృత్వ పోకడలతో పాలన సాగించారని లక్ష్మణ్ మండిపడ్డారు. కక్ష సాధింపులో భాగంగా పలువురిపై ఫోన్ ట్యాపింగ్ చేశారు. అసెంబ్లీ, ఉప ఎన్నికల సమయంలో రాజకీయంగా లబ్ది పొందేందుకు ప్రయత్నించారు. ఈ కుంభకోణంలో కొంత మంది పోలీసు అధికారులు ఏ రకంగా అక్రమార్జనకు పాల్పడ్డారో ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. కేసీఆర్ ప్రభుత్వం పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించింది. ఇది తీవ్రమైన నేరం అని లక్ష్మణ్ ఆరోపించారు.

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో దుమారం రేపుతోంది. ఈ తరుణంలో పార్టీల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. ఈ తరుణంలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని బీజేపీ ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ డిమాండ్ చేశారు.. కేటీఆర్ మాటలను బట్టి.. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని బహిరంగంగానే ఒప్పుకున్నారని గుర్తు చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటేనని విమర్శించారు. ఈ రెండు పార్టీల పాలనతో తెలంగాణ ప్రజలు విసిగిపోయారని డాక్టర్ లక్ష్మణ్ విమర్శించారు. పోలీసులేమో నేతలు చెప్తే ఫోన్ ట్యాపింగ్ చేశామని అంటున్నారని.. కెటిఆర్ ఒక్కరిద్దరి ఫోన్లు ట్యాప్ అయ్యి ఉండొచ్చు అని మాట్లాడుతున్నారన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన గ్యారంటీలు అమలు చేయకుండా.. వాటి నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు ఇటువంటివి వాటిని తెర మీదకి తెస్తున్నారనే అనుమానం కల్గుతుందన్నారు. బీఆర్ఎస్ అవినీతి ఎక్కడ బయట పడతాది అనే అభద్రత భావంతో కేటీఆర్ ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారన్నారు. ఉప ఎన్నిక ల సమయంలో ప్రతిపక్ష నేతల ఫోన్లు ట్యాప్ చేసారంటూ ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ కి మూల కారణం కేసిఆర్ అని కాంగ్రెస్ చెప్తుందని.. దీని వెనకాల ఉన్న వారందరూ బయటికి రావాలంటే ఈ కేసును సీబీఐకి అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐ ఎంక్వయిరీకి అప్పజెప్పి రేవంత్ లీకువీరుడు కాదు గ్రీకువీరుడు అని నిరూపించుకోవాలన్నారు.. తన ఫోన్ కూడా ట్యాపింగ్ జరిగిందో లేదో విచారణ జరిపి తేల్చాలని డిమాండ్ చేశారు. ఇదిలాఉంటే.. ఇదే కేసు విషయంలో కీలక విషయాలను బయట పెట్టాలని రఘునందనరావు కూడా డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. అంతేకాకుండా కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి కూడా తన ఫోన్ ను ట్యాపింగ్ చేశారని ఏకంగా డీజీపీకి ఫిర్యాదు చేశారు.

# కసబ్‌ను పట్టుకున్న పోలీస ధీరుడు

## సదానంద వసంత్‌కు ఎన్ఐఎ డైరెక్టర్‌గా ప్రమోషన్

**న్యూఢిల్లీ :** మహారాష్ట్ర 'ఉగ్రవాద వ్యతిరేక దళం' అధిపతిగా ఉన్న సదానంద్ వసంత్ దాతెను 'జాతీయ దర్యాప్తు సంస్థ' ఎన్ఐఏ డైరెక్టర్ జనరల్‌గా నియమిస్తూ కేంద్ర హోంశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ పదవిలో ఉన్న దినకర్ గుప్తా ఈనెల 31న పదవీ విరమణ చేయనున్నారు. ఆయన స్థానంలో రాబోతున్న 1990 బ్యాచ్ ఐపీఎస్ అధికారి వసంత్– 2026 డిసెంబరు 31 వరకు ఈ పదవిలో కొనసాగనున్నారు. 26/11 దాడిగా పేరొందిన ముంబయి పేలుళ్ల ఘటనలో కీలక ఉగ్రవాదులు అజ్మల్ కసబ్, అబు ఇస్మాయిల్‌లను పట్టుకున్నది వసంతే. అప్పుడు ఆయన ముంబయి అదనపు పోలీసు కమిషనర్‌గా ఉన్నారు. ఉగ్రవాదులు విసిరిన గ్రనేడ్ పేలి.. కాళ్లూచేతులకు తీవ్రగాయాలై, చాలారక్తం కోల్పోయి తాను స్పృహతప్పి పడిపోయేంతవరకు దాదాపు గంటసేపు ఆయన వీరిద్దరినీ ఆనాడు వదల్లేదు. గ్రనేడ్ తునకలు శరీరాన్ని చీల్చినా వెనక్కి తగ్గకుండా కాల్పులు జరుపుతూ, సీనియర్ అధికారులకు ముఖ్యమైన సమాచారం చెబుతూ ఎదురుదాడి పనిని సులభతరం చేశారు. ఆనాటి సాహసోపేత చర్యకు గానూ ఆయన రాష్ట్రపతి పోలీసు పతకాన్ని కూడా అందుకున్నారు. ఉగ్రదాడుల కేసుల దర్యాప్తు నిపుణుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ముంబయి ఘటన అనంతరం ఉగ్రదాడుల నిర్మూలనకు ఎన్ఐఏ ఆవిర్భవించగా 16 ఏళ్ల తర్వాత ఇప్పుడు దాని పగ్గాలు ఆయన చేతికి దక్కాయి. అధునాతన ఆయుధాలను అలవోకగా వినియోగించగలిగే సామర్థ్యం ఉన్న వసంత్ దాతె.. మరాఠీలో ఒక పుస్తకం కూడా రాశారు. పేద కుటుంబానికి చెందిన ఆయన పుణెలో కొన్నాళ్లు దినపత్రికలు విక్రయించారు. 'జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం' (ఎన్‌డీఆర్ఎఫ్) అధిపతి అతుల్ కర్వాల్ స్థానంలో పీయూష్ ఆనంద్‌ను కేంద్రం నియమించింది. ఆనంద్ ప్రస్తుతం సీఐఎస్ఎఫ్ ప్రత్యేక డీజీగా ఉన్నారు. 'బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్, డెవలప్‌మెంట్' డైరెక్టర్ జనరల్‌గా రాజస్థాన్ క్యాడర్‌కు చెందిన 1990 బ్యాచ్ ఐపీఎస్ రాజీవ్ కుమార్ శర్మ నియమితులయ్యారు.

# 'కేసీఆర్ ఫోన్ ట్యాపింగ్ చేయించటానికి కారణమదే'



నియంత్రుత్వాన్ని పాటించే నాయకులు తమ నీడను కూడా నమ్మరని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ కూడా ఆ కోవలోకే వస్తారని తెలిపారు. అందుకే కేసీఆర్ తాను సీఎంగా ఉన్నప్పుడు ప్రతిపక్ష నేతలు, మీడియా ప్రముఖుల ఫోన్లు ట్యాపింగ్ చేయించారని ఆయన ఆరోపించారు.



పార్లమెంట్ ఎన్నికల వేళ తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం కాకరేపుతోంది. ఈ అంశం చుట్టూనే ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాలు నడుస్తున్నాయి. అన్ని పార్టీలు ఫోన్ ట్యాపింగ్ అంశంపై తీవ్ర స్థాయిలో స్పందిస్తున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపక్ష నేతలు, కీలక అధికారుల ఫోన్లు ట్యాప్ చేయించిందని కాంగ్రెస్, బీజేపీలు ఆరోపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ట్యాపింగ్ వ్యవహారంపై బీజేపీ సీనియర్ నేత, ఎంపీ లక్ష్మణ్ కీలక కామెంట్స్ చేశారు. నియంత్రుత్వాన్ని పాటించే వాళ్లు నీడను కూడా నమ్మరని లక్ష్మణ్ అన్నారు. కేసీఆర్ కూడా ఎవరినీ నమ్మలేదని.. అందుకే రాజకీయ, కీలక అధికారులు, మీడియా ప్రముఖులపై ఫోన్ ట్యాపింగ్ చేయించారని ఆరోపించారు. కేంద్ర హెూం శాఖ అనుమతి లేకుండా ఫోన్ ట్యాపింగ్ చేశారని... రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో హార్డ్ డిస్కులు, సమాచారాన్ని ధ్వంసం చేశారన్నారు. రెండో, మూడో ఫోన్ ట్యాపింగ్‌లు జరిగితే జరగవచ్చునని స్వయంగా కేటీఆరే అంటున్నారని... దీనికి మూల కారకులు కేసీఆర్, కేటీఆర్ మాత్రమేనని చెప్పారు.

సీఎం రేవంత్‌రెడ్డి ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై స్పందించి సీబీఐ విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. మద్యం కుంభకోణంలో కవిత పాత్ర ఉందని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకల్లో ఆ కుటుంబానికి ప్రమేయముందని అన్నారు. తెలంగాణ సంపదను దోచకున్న వారికి శిక్ష పడాలని ప్రజలు కోరుకుంటున్నారని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ పార్టీని ఓడించి శిక్ష విధించినా.. ఆ పార్టీ నేతలు అహంకారాన్ని మాత్రం వీడటం లేదని అన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కేసీఆర్ ఫామ్ హౌస్ నుంచి కదలలేదని... సచివాలయానికి ఒక్కసారి కూడా వెళ్లలేదని ఆక్షేపించారు. గత ప్రభుత్వంలో ప్రతి పథకంలో స్కామ్‌లు చేసి.. కమీషన్లు తీసుకున్నారన్నారు. ప్రశ్నించే వారిని బెదిరింపులకు గురి చేయటంతో పాటు నియంతృత్వ పోకడలు సాగించారని దుయ్యబట్టారు. కక్ష సాధింపులో భాగంగా పలువురిపై ఫోన్లు ట్యాపింగ్ చేశారని లక్ష్మణ్ ఆరోపించారు. అసెంబ్లీ, ఉప ఎన్నికల సమయంలో రాజకీయంగా లబ్ధి పొందేందుకు ప్రయత్నిచారని.. ఫోన్ ట్యాపింగ్ తీవ్రమైన నేరమని ఆయన ఆక్షేపించారు.

# నేడు తెలంగాణలో ఎమ్మెల్సీ ఉపఎన్నిక.. ఓటు వేయనున్న సీఎం రేవంత్



మహబూబ్ నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు నేడు పోలింగ్ జరగనుంది. పార్లమెంట్ ఎన్నికలకు ముందు కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో ఎన్నికపై ఉత్కంఠ నెలకొంది. మరోవైపు శిబిరాలకు తీసుకెళ్లిన ప్రజాప్రతినిధులంతా నేరుగా పోలింగ్‌బూత్‌లకు తరలివస్తున్నారు.

నేడు మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి ఉప ఎన్నిక జరగనుంది. పార్లమెంట్ ఎన్నికలకు ముందు జరుగుతున్న పోలింగ్ కావటంతో అన్ని పార్టీలు ఈ ఉపఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాడు. పోలింగ్‌కు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. నేడు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుండగా.. స్థానిక సంస్థల పరిధిలోని ఎంపీటీసీలు, జెడ్పీటీసీ సభ్యులు, పురపాలక కౌన్సిలర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వీరితోపాటు ఎక్స్ అఫీషియో హెూదాలో ఉమ్మడి జిల్లా పరిధిలోని 14 అసెంబ్లీ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలతోపాటు ముగ్గురు ఎమ్మెల్సీలు మొత్తంగా 1,439 మంది ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని కొడంగల్ నియోజకవర్గం నుంచి సీఎం రేవంత్ రెడ్డి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తుండగా.. ఎక్స్ అఫీషియోగా కొడంగల్‌లో రేవంత్ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

ఇక్కడ ఎమ్మెల్సీగా ఉన్న కసిరెడ్డి నారాయణ రెడ్డి రాజీనామా చేసి ఎమ్మెల్యేగా గెలవటంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. అధికార కాంగ్రెస్ నుంచి టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ నుంచి జెడ్పీ మాజీ చైర్మన్ నవీన్ కుమార్ రెడ్డి, స్వతంత్ర్య అభ్యర్థి సుదర్శన్ గౌడ్ బరిలోకి దిగుతున్నారు. సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకుని పట్టు సాధించాలని బీఆర్ఎస్.. ఈ ఎన్నికల్లో గెలిచి సత్తా చాటాలని కాంగ్రెస్ వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ఓటర్లు చేజారొద్దనే ఉద్దేశంతో ఓటర్లను ఆయా పార్టీలు గోవా, ఊటీ, కొడైకెనాల్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన క్యాంప్‌లకు తరలించారు. క్యాంపులకు తరలించిన వారిని నేరుగా పోలింగ్ కేంద్రానికి తీసుకురానున్నారు. ఉపఎన్నికకు మహబూబ్‌నగర్, కొడంగల్, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, నారాయణపేట, వనపర్తి, గద్వాల, కొల్లాపూర్ కల్వకుర్తి, షాద్‌నగర్ నియోజకవర్గ కేంద్రాల్లోని మండల పరిషత్ కార్యాలయాల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. బ్యాలెట్ ద్వారా ప్రజాప్రతినిధులు ఓట్లు వేయనున్నారు. బుధవారం ఉమ్మడి జిల్లా కేంద్రం నుంచి అన్ని పోలింగ్ సెంటర్లకు ఎన్నికల సామగ్రిని పంపిణీ చేశారు. ఏప్రిల్ 2న మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాలలో ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

# భూపాలపల్లి ఫొటోగ్రాఫర్‌కు అరుదైన గుర్తింపు..




జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన ఫొటోగ్రాఫర్, డాక్టర్ అరుణ్‌కుమార్ నలిమెల అరుదైన ఘనత సాధించారు. ఆయన తీసిన ఫొటో అమెరికాలోని న్యూయార్క్ టైమ్స్ స్క్వేర్ బిల్‌బోర్డుపై ప్రదర్శితమైంది. ఈ నేపథ్యంలో అరుణ్ కుమార్‌ను పలువురు అభినందించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన ఫొటోగ్రాఫర్‌కు అరుదైన గుర్తింపు దక్కింది. ప్రపంచంలోనే ప్రధానమైన కమర్షియల్ జంక్షన్, టూరిస్ట్ డెస్టినేషన్, ఎంటర్టైన్మెంట్ హబ్ అయిన న్యూయార్క్ టైమ్స్ స్క్వేర్‌లో జిల్లా కేంద్రానికి చెందిన డాక్టర్ అరుణ్ కుమార్ నలిమెల తీసిన ఫోటోను ప్రదర్శించారు. ఎన్ఎఫ్‌టీఎన్‌వైసీ అనే సంస్థ ఇటీవల ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీల్లో 5 వేల ఫొటోలు పోటీ పడగా.. అరుణ్ తీసిన చిత్రం పోటీలో ఎంపికైంది. ఈ నేపథ్యంలోనే న్యూయార్క్ టైం స్క్వేర్ బిల్‌బోర్డుపై మంగళవారం (మార్చి 26) రాత్రి నుంచి ప్రదర్శితమవుతున్నట్లు అరుణ్ తెలిపారు. నాలుగు రోజుల పాటు ఈ ప్రదర్శన ఉంటుందని.. తన కల నెరవేరినందుకు సంతోషంగా ఉందని అరుణ్ కుమార్ వెల్లడించారు. భారత సాంస్కృతిక మంత్రిత్వ శాఖ సహకారంతో లలిత కళా అకాడమీ నిర్వహించిన మేళా మూమెంట్ ఫొటోగ్రఫీ పోటీల్లోనూ ఆయన ఇటీవల బహుమతి అందుకున్నారు. గత ఏడాది డిసెంబర్‌లో ప్రధాని మోదీ అరుణ్ కుమార్ తీసిన ఫొటోల గురించి మన్ కీ బాత్‌లో ప్రస్తావించారు. ఆయన ప్రతిభను కొనియాడారు. తాజాగా.. ఆయన తీసిన చిత్రం ప్రఖ్యాత న్యూయార్క్ టైమ్స్ స్క్వేర్ బిల్ బోర్డుపై ప్రదర్శితమైంది.

# బదిలీ వేటు వేసిన ఎన్నికల కమిషన్



పొలిటికల్ పార్టీ కార్యక్రమంలో పాల్గొన్న జనగాం ఏసీపీపై వేటు పడింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఏసీపీ దామోదర్ రెడ్డిని ఎన్నికల సంఘం బదిలీ చేసింది. డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. పార్లమెంట్ ఎన్నికల కోడ్ నిబంధనలు ఉల్లంఘించిన వ్యవహారంలో జనగామ ఏసీపీ దామోదర్ రెడ్డిపై వేటు పడింది. ఈ మేరకు ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 23న పెంబర్తి బైపాస్ రోడ్డు సమీపంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం ప్రారంభ కార్యక్రమంలో ఏసీపీ పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకుడు కొమ్మూరి ప్రశాంత్ రెడ్డితో కలిసి ఏసీపీ దామోదర్ రెడ్డి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ వ్యవహారంపై స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఎన్నికల కోడ్ నిబంధనలు ఉల్లంఘిస్తూ.. పొలిటికల్ పార్టీ కార్యక్రమంలో పాల్గొన్న ఏసీపీ చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఘటనపై విచారణ చేపట్టిన ఎన్నికల సంఘం ఏసీపీ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆయన్ను ఎన్నికల విధుల నుంచి తప్పిస్తూ.. నిబంధనల మేరకు డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది.

జనగామ ఏసీపీగా దామోదర్‌రెడ్డి నెల క్రితమే ఛార్జ్ తీసుకున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన దేవేందర్‌రెడ్డి హనుమకొండ ఏసీపీగా ట్రాన్స్‌ఫర్ చేయటంతో ఆయన స్థానంలో దామోదర్‌రెడ్డి నియామకం అయ్యారు. అయితే అధికార పార్టీకి కొమ్ముకాస్తున్నారని ఆయనపై స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి విమర్శలు గుప్పించారు. ఈ మేరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా.. పార్టీ కార్యక్రమంలో పాల్గొన్నాడనే కారణంతో ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. దీంతో ఎన్నికల సంఘం ఏసీపీని బదిలీ చేస్తూ ఆదేసాశాలు జారీ చేసింది.

# భర్తపై వేడి నీళ్లు పోసిన భార్య..

కరీంనగర్ జిల్లాలో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. కుటంబ కలహాలతో సలసల మరిగే వేడినీళ్లను భర్తపై పోసింది ఓ భార్య. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన భర్త ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశాడు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని సుభాష్ నగర్‌లో దారుణం దారుణం చోటు చేసుకుంది. కుటుంబ కలహాలతో ఓ భార్య భర్తపై వేడినీళ్లు పోసింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన భర్త ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. వివరాల్లోకి వెళితే.. సుభాష్ నగర్ ప్రాంతానికి చెందిన హేమంత్, రోహిణి దంపతులు. హేమంత్ స్థానికంగా ఓ కంపెనీలో పని చేస్తుండగా.. రోహిణి ప్రభుత్వ ఆసుపత్రి లోని చిల్డ్రన్స్ కేర్ విభాగంలో పనిచేస్తుంది. అయితే గత కొద్ది కాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరగుతున్నాయి. బుధవారం (మార్చి 27) రాత్రి కూడా ఇద్దరి మధ్య గొడవ జరిగింది. భార్యాభర్తలు ఇద్దరు ఒకర్నొకరు తీవ్రంగా దూషించుకున్నారు. విచక్షణ కోల్పోయిన భార్య.. పొయ్యిమీద సలసల కాగుతున్న వేడి నీళ్లను భర్తపై పోసింది. ఈ ఘటనలో హేమంత్ తీవ్రంగా గాయపడ్డాడు. అనంతరం అతడిని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇవాళ ఉదయం హేమంత్ కన్నుమూశాడు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. భర్త మృతికి కారణమైన రోహిణిని అదుపులోకి తీసుకున్నారు.

# ఆ రూట్‌లో ట్రాఫిక్ రద్దీకి చెక్..!



హైదరాబాద్‌లోని గచ్చిబౌలి, కొండాపూర్ ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. కొత్తగూడ ఫ్లైఓవర్ వద్ద ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టారు. హైదరాబాద్ వాహనదారులకు అలర్ట్. కొత్తగూడ ఫ్లైఓవర్ వద్ద ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. ఈ మేరకు మళ్లింపు, తదితర వివరాలతో సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. రేపటి నుంచి (మార్చి 29) ప్రయోగాత్మకంగా కొత్తగూడ ఫ్లైఓవర్ వైపు వెళ్లే వాహనాలను మళ్లింపునకు ప్లాన్ చేసినట్లు వెల్లడించారు. అటుగా వెళ్లే ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించి అందుకు అనుగుణంగా తమ ప్రయాణ మార్గాలను ఎంచుకోవాలని సూచించారు. హఫీజ్‌పేట నుంచి గచ్చిబౌలి వైపు వచ్చే ట్రాఫిక్‌ను కొత్తగూడ ఫ్లై ఓవర్ మీదుగా సోమవారం నుంచి శుక్రవారం వరకు 8 గంటల నుంచి 12 గంటల వరకు కార్యాలయం, కొండాపూర్ నుంచి గచ్చిబౌలికి అనుమతిస్తారు. బొటానికల్ గార్డెన్స్ నుంచి కొండాపూర్ ఆఫీస్, హైటెక్ సిటీ వైపు వచ్చే ట్రాఫిక్‌ను కొత్తగూడ ఫ్లైఓవర్‌పై యథావిధిగా అనుమతిస్తారు. జయభేరి నెక్సా, గచ్చిబౌలి నుంచి హఫీజ్‌పేట వైపు వచ్చే ట్రాఫిక్‌ను యథావిధిగా కొత్తగూడ ఫ్లై ఓవర్‌పై నుంచి అనుమతిస్తారు. రూ. 263 కోట్ల వ్యయంతో 3 కిలోమీటర్ల మేర కొత్తగూడ ఫ్లైఓవర్‌ను నిర్మించారు. ఈ ఫ్లైఓవర్‌కు అనుబంధంగా 470 మీటర్ల పొడవుతో 11 మీటర్ల వెడల్పుతో అండర్ పాస్‌ను కూడా నిర్మించారు. ఫ్లై ఓవర్ నిర్మాణంతో గచ్చిబౌలి, కొండాపూర్ వాసులు ప్రయోజనం పొందుతారు. గచ్చిబౌలి నుంచి మియాపూర్ వరకు, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ నుంచి హైటెక్ సిటీ వరకు కనెక్టివిటీతో పాటు పరిసర ప్రాంతాలను కలుపుతుంది. ఈ వంతెన వల్ల బొటానికల్ గార్డెన్, కొత్తగూడ జంక్షన్‌లలో 100 శాతం ట్రాఫిక్ సమస్య పరిష్కారం అవడమే కాకుండా కొండాపూర్ జంక్షన్‌లో 65 శాతం ట్రాఫిక్ సమస్య తీరుతుంది. ఈ ఫ్లైఓవర్‌ను ఈ ఏడాది జనవరిలో ప్రారంభించారు.

# వందేళ్లు దాటిన ఓటర్లు ఎంత మందో తెలుసా..?

రాష్ట్రంలో వందేళ్లు దాటిన వృద్ధ ఓటర్ల సంఖ్య తగ్గింది. ఏటా నిర్వహించే ఓటర్ల జాబితా సవరణ తరవాత ఈ ఏడాది ఫిబ్రవరి 8న ప్రకటించిన తుది ఓటర్ల జాబితాలో వీరి సంఖ్య 6,292కు చేరింది. ఇందులో పురుషులు 2,805 మంది, మహిళలు 3,486 మంది ఉండగా ఇతర ఓటర్లు ఒకరు ఉన్నారు. తెలంగాణలో మే 13న పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో కొత్త ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు కేంద్ర ఎన్నికల సంఘం అనుమతి ఇచ్చింది. వచ్చే నెల 15 వరకు కొత్తగా ఓటర్లుగా చేరవచ్చు. అదే సమయంలో ఏటా నిర్వహించే ఓటర్ల జాబితా సవరణ తరవాత ఈ ఏడాది ఫిబ్రవరి 8న తుది ఓటర్ల జాబితాను ప్రకటించారు. ఈ జాబితాలో రాష్ట్రంలో శతాధిక వృద్ధ ఓటర్ల సంఖ్య తగ్గింది. వీరి సంఖ్య ప్రస్తుతం 6,292కు చేరింది. గత నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో విడుదల చేసిన ఓటర్ల జాబితాలో ఈ ఓటర్లు 7,689 మంది ఉన్నారు. నాటి జాబితాతో పోలిస్తే వంద సంవత్సరాలు దాటిన ఓటర్లు 1,397 మంది తగ్గడం గమనార్హం. గత నెలలో ప్రకటించిన ఓటర్ల జాబితా ఆధారంగా.. వయసుల వారీగా వివరాలతో అధికారులు ప్రస్తుతం జాబితా రూపొందించారు. దీని ప్రకారం 8,51,853 మంది తొలిసారి ఓటు హక్కు నమోదు చేసుకున్నారు. పురుష ఓటర్ల కన్నా మహిళా ఓటర్లు సుమారు 1.55 లక్షల మంది అధికంగా ఉన్నారు. 30 సంవత్సరాల నుంచి వందేళ్ల వయసు దాటిన అన్ని విభాగాల్లోనూ మహిళా ఓటర్లు అధికంగా ఉండటం విశేషం. కేవలం 18 నుంచి 29 సంవత్సరాల వయసు ఓటర్లలో మాత్రమే పురుషులు అధికంగా ఉన్నారు. తెలంగాణలో మొత్తం ఓటర్ల సంఖ్య 3,30,21,735 కోట్లు. వీరిలో పురుషులు 1,63,31,777 కాగా.. మహిళలు 1,65,87,221 కోట్లు. ఇతరులు 2,737 గా కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన ముసాయిదాలో వెల్లడించింది. వందేళ్లు దాటిన ఓటర్లు 6,292 కాగా.. అందులో పురుషులు 2,805 మంది ఉన్నారు. 3,486 మహిళా ఓటర్లు ఉండగా.. ఇతర ఓటర్లు ఒకరు ఉన్నారు.



# ఒంటరిగా ట్రావెల్ చేసే మహిళలు ఈ నెంబర్‌కు కాల్ చేస్తే సేఫ్..





మహిళల భద్రత కోసం తెలంగాణ ఉమెన్ సెఫ్టీ వింగ్ కొత్తగా ఓ వీడియోను రూపొందించింది. ఒంటరిగా ట్రావెల్ చేసేవారు ఎవరైనా తాము ప్రమాదంలో ఉన్నామనే అనుమానం వస్తే వెంటనే 100కు డయల్ చేసి ట్రాక్ మీ సర్వీసెస్ ద్వారా సురక్షిత ప్రయాణం చేయాలని సూచిస్తున్నారు. మహిళల భద్రతకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. అందుకోసం ప్రత్యేకంగా షీ టీమ్స్ సైతం ఏర్పాటు చేసింది. మహిళలు, పిల్లలు, బాలికలపై తరుచూ వేధింపులకు పాల్పడే ప్రాంతాలను హాట్‌స్పాట్లుగా గుర్తించి షీ టీమ్స్ ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నాయి. ఇదిలా ఉండగా.. రాష్ట్ర మహిళా భద్రత విభాగం వారి భద్రత కోసం సరికొత్తగా క్యాంపెయిన్ చేస్తోంది. అందుకు సంబంధించిన ఓ షార్ట్ ఫిల్మ్ రూపొందించింది. ఆ వీడియోలో ఓ యువతి అర్ధరాత్రి సమయంలో బస్టాండ్‌లో దిగుతుంది. అక్కడే ఉన్న ఓ పెద్దావిడ యువతితో మాట కలపుతుంది.

ఎక్కడి వెళ్లాలని అడుగుతుంది. తాను విద్యానగర్ వెళ్లాలని యువతి చెప్పగా.. తాను కూడా అటువైపే వెళుతున్నానని కావాలంటే నా కారులో డ్రాప్ చేస్తానని చెబుతుంది. ఆమె మాటలు విన్న యువతి కొంత అనుమానంతోనే సరే అని అంటుంది. ఈ లోగా.. 100 నెంబర్‌కు కాల్ చేస్తుంది. ఆ నెంబర్‌కు కాల్ చేయగానే.. ట్రాక్ మీ సర్వీసెస్ కోసం 8 నొక్కమని వీఆర్ఎస్ వాయిస్ ద్వారా సూచనలు ఇస్తుంది. 8 నెంబర్ ప్రెస్ చేయగానే..4 డిజిట్ సీక్రెట్ పాస్ కోడ్ మొబైల్‌కు వస్తుంది. కోడ్ ఎంటర్ చేయగానే.. సదరు యువతి ట్రావెల్ ట్రిప్‌ను తెలంగాణ పోలీసులు కంట్రోల్ రూం ద్వారా మానిటరింగ్ చేస్తారు. ఆ తర్వాత కొద్ది నిమిషాల్లనే సెఫ్టీ చెక్ కాల్ ట్రాక్ సర్వీస్ నుంచి సెఫ్టీ చెక్ కాల్ వస్తుంది. కాల్ లిఫ్ట్ చేస్తే.. సేఫ్ అయితే 1 ప్రెస్ చేయమని.. నాట్ సేఫ్ అయితే 2 నొక్కమనే ఆప్షన్ వస్తుంది. ఒకవేళ ప్రమాదంలో ఉంటే వెంటనే రెండు నొక్కాలి.

అలా నొక్కగానే పోలీసులు వెంటనే మిమ్మల్ని ట్రాక్ చేస్తారు. ఇలా పోలీసు కంట్రోల్ రూం నుంచి పదే పదే కాల్స్ వస్తాయి. ఒకవేళ మీరు ఫోన్ లిఫ్ట్ చేయకపోయినా.. పోలీసులు వెంటనే ట్రాక్ చేస్తారు. పోలీసుల విడుదల చేసిన వీడియోలోనూ సదరు యువతిని పెద్దావిడ కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నిస్తుంది. మత్తు మందుతో కూడిన కర్చీఫ్ నోటి వద్ద ఉంచటంతో యువతి స్పృహతప్పి పడిపోతుంది. ఆ తర్వాత యువతి ఫోన్‌కు కంట్రోల్ రూం నుంచి కాల్స్ రాగా.. ఆమె లిఫ్ట్ చేయదు. దాంతో యువతి ప్రమాదంలో ఉందని గ్రహించిన పోలీసులు వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇస్తారు.

అక్కడి పోలీసులు యువతి వెళ్తున్న వాహనాన్ని ఛేజ్ చేసి రక్షిస్తారు. ఈ వీడియోను ఒంటరిగా వెళ్లే మహిళలు, ఆడపిల్లలు తప్పకుండా చూడాలని.. అలాగే ఇతరులకు షేర్ చేయాలని పోలీసులు కోరుతున్నారు.

**అక్కడే ఉన్న ఓ పెద్దావిడ యువతితో మాట కలపుతుంది. ఎక్కడి వెళ్లాలని అడుగుతుంది. తాను విద్యానగర్ వెళ్లాలని యువతి చెప్పగా.. తాను కూడా అటువైపే వెళ్తున్నానని కావాలంటే నా కారులో డ్రాప్ చేస్తానని చెబుతుంది. ఆమె మాటలు విన్న యువతి కొంత అనుమానంతోనే సరే అని అంటుంది. ఈ లోగా.. 100 నెంబర్‌కు కాల్ చేస్తుంది. ఆ నెంబర్‌కు కాల్ చేయగానే.. ట్రాక్ మీ సర్వీసెస్ కోసం 8 నొక్కమని వీఆర్ఎస్ వాయిస్ ద్వారా సూచ నలు ఇస్తుంది. 8 నెంబర్ ప్రెస్ చేయ గానే..4 డిజిట్ సీక్రెట్ పాస్ కోడ్ మొబైల్‌కు వస్తుంది. కోడ్ ఎంటర్ చేయగానే.. సదరు యువతి ట్రావెల్ ట్రిప్‌ను తెలంగాణ పోలీసులు కంట్రో ల్ రూం ద్వారా మాని టరింగ్ చేస్తారు.**

# అలా చేస్తే ఊరుకునేది లేదు.. పెళ్లికి ముందే బర్రెలక్క వార్నింగ్...



**"మా ప్రీ వెడ్డింగ్ షూట్ సాంగ్‌ను చాలా మంది డౌన్‌లోడ్ చేసుకుని వాళ్ల యూట్యూబ్ ఛానెళ్లలో పెట్టుకుంటున్నారు. నేను మాత్రం 100 పర్సెంట్ స్ట్రైక్ వేస్తా. ఎందుకంటే మేము ఈ సాంగ్ కావాలని రాయించుకున్నాం. ఇంతకుముందు ఎన్నికల సమయంలో అంటే ఓకే. చాలా మంది తమ యూట్యూబ్ ఛానెళ్లలో అప్‌లోడ్ చేసుకున్నార్ నేను ఏమీ అనలేదు. తర్వాత.. క్లైమ్స్ పడ్డాయి.. స్ట్రైక్స్ పడ్డాయి.. కాపీ రైట్స్ కూడా పడ్డాయి. దానికి నాకు సంబంధం లేదు.**

బర్రెలక్క పెళ్లి ఘనంగా జరిగింది. వెంకటేష్ అనే అబ్బాయితో శిరీష పెళ్లి చేసుకుంది. శిరీష పెళ్లి తంతును చాలా యూట్యూబ్ ఛానెళ్లు లైవ్ స్ట్రీమింగ్ కూడా పెట్టాయి. అయితే.. పెళ్లికి ముందే బర్రెలక్క ఓ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చింది. అది కూడా యూట్యూబ్ ఛానెళ్లకు. పెళ్లికి ముందు విడుదల చేసిన ప్రీ వెడ్డింగ్ సాంగ్‌ను డౌన్ లోడ్ చేసుకుని చాలా మంది తమ యూట్యూబ్ ఛానెళ్లలో పెట్టుకుంటున్నారని.. బర్రెలక్క చాలా సీరియస్ అయ్యింది.


బర్రెలక్క అలియాస్ కర్నె శిరీష పెళ్లి ఈరోజు (మార్చి 28న) ఘనంగా జరిగింది. మహబూబ్‌నగర్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం మరికల్ గ్రామానికి చెందిన శిరీష.. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి గ్రామానికి చెందిన వెంకటేష్.. కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషుల మధ్య మూడుముళ్ల బంధంతో ఒక్కటయ్యారు. వీరి పెళ్లికి బంధువులతో పాటు చాలా మంది శ్రేయోభిలాషులు వచ్చి తమ ఆశీర్వాదాలు అందించారు. అయితే.. పెళ్లికి ముందే బర్రెలక్క స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చింది. అయితే.. ఆమె వార్నింగ్ ఇచ్చింది ఆమె భర్తకు కాదండోయ్.. యూట్యూబ్ ఛానళ్లకు. బర్రెలక్క ఇంత ఫేమస్ కావటానికి కారణం ఆ యూట్యూబ్ ఛానల్సే కాదా.. ఇప్పుడు వాళ్లకే వార్నింగ్ ఇవ్వటమేంటని అనుకుంటున్నారా..?

అయితే.. యూట్యూబ్ ఛానళ్లకు బర్రెలక్క ఎందుకు వార్నింగ్ ఇచ్చిందంటే.. తన పెళ్లికి ముందు ప్రీ వెడ్డింగ్ సాంగ్ రిలీజ్ చేసింది బర్రెలక్క. ఈ ప్రీ వెడ్డింగ్ సాంగ్‌ను సినిమా రేంజ్‌లో ప్లాన్ చేసి.. షూట్ చేపించుకుంది. ఓ శిరీష.. నా శిరీష.. అంటూ సాగే ఈ పాటను ప్రత్యేకంగా తమ కోసమే రాపించుకుని మరీ.. కంపోజ్ చేపించుకున్నారు. అందుకు తగ్గట్టుగానే మంచి మంచి లొకేషన్లలో షూట్ చేపించుకున్నారు. సాంగ్ అవుట్ పుట్ కూడా చాలా బాగా వచ్చింది. తమ అఫీషియల్ ఛానల్‌లో అప్‌లోడ్ చేసిన గంటల్లోనే లక్షల్లో వ్యూస్ వచ్చాయంటే.. పాట ఎంత వైరల్ అయ్యిందో అర్థం చేసుకోవచ్చు. అయితే.. ఇప్పుడు ఈ పాట గురించి యూట్యూబర్లకు బర్రెలక్క వార్నింగ్ ఇచ్చింది. జీవితాంతం గుర్తుండిపోవాలన్న ఉద్దేశంతో ప్రత్యేకంగా పాట రాయించుకుని తీసుకున్న ప్రీవెడ్డింగ్ సాంగ్‌ను.. వేరే యూట్యూబ్ ఛానల్స్, సోషల్ మీడియా అకౌంట్లలో కూడా అప్‌లోడ్ చేసుకుంటున్నారు. ఈ విషయంపై స్పందించిన బర్రెలక్క.. సీరియస్ అవుతూ ఓ వీడియో విడుదల చేసింది.

"మా ప్రీ వెడ్డింగ్ షూట్ సాంగ్‌ను చాలా మంది డౌన్‌లోడ్ చేసుకుని వాళ్ల యూట్యూబ్ ఛానెళ్లలో పెట్టుకుంటున్నారు. నేను మాత్రం 100 పర్సెంట్ స్ట్రైక్ వేస్తా. ఎందుకంటే మేము ఈ సాంగ్ కావాలని రాయించుకున్నాం. ఇంతకుముందు ఎన్నికల సమయంలో అంటే ఓకే. చాలా మంది తమ యూట్యూబ్ ఛానెళ్లలో అప్‌లోడ్ చేసుకున్నార్ నేను ఏమీ అనలేదు. తర్వాత.. క్లైమ్స్ పడ్డాయి.. స్ట్రైక్స్ పడ్డాయి.. కాపీ రైట్స్ కూడా పడ్డాయి. దానికి నాకు సంబంధం లేదు. కానీ.. ఈ సాంగ్ మాత్రం నేను రాయించుకున్న సాంగ్ కాబట్టి ఎవరు అప్ లోడ్ చేసుకున్నా గానీ నేను మాత్రం స్ట్రైక్స్ వేస్తా, క్లైమ్స్ వేస్తా.. తర్వాత ఏంటక్క ఇలా చేశావని బాధపడొద్దు. ఇది నాకు లైఫ్ లాంగ్ గుర్తుండేలా.. కేవలం నా ఛానెల్‌లో ఉండేలా.. స్పెషల్‌గా రాయించుకున్న సాంగ్ ఇది. సో ఎవరూ బాధపడొద్దు. ప్లీజ్ ఎవరి ఛానెల్‌లో అప్‌లోడ్ చేసుకోవద్దు." అంటూ సున్నితంగానే గట్టి వార్నింగ్ ఇచ్చింది. కాగా.. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అయ్యింది.




# ఎప్పటికీ అలా అడగను



అప్పుడప్పుడూ అనువాద చిత్రాలతోనూ పలకరించేవాడు. కానీ 'సలార్' మూవీలో కీలక పాత్రతో పృథ్వీరాజ్‌కు మన దగ్గర వచ్చిన గుర్తింపే వేరు తెలుగు వారికి ఈ మధ్య బాగా చేరువైన మలయాళ నటుడు పృథ్వీరాజ్. అతను తెలుగులో 'పోలీస్ పోలీస్' అనే డైరెక్ట్ మూవీ చేసిన విషయం జనాలకు పెద్దగా తెలియదు. అప్పుడప్పుడూ అనువాద చిత్రాలతోనూ పలకరించేవాడు. కానీ 'సలార్' మూవీలో కీలక పాత్రతో పృథ్వీరాజ్‌కు మన దగ్గర వచ్చిన గుర్తింపే వేరు. ఇప్పుడతను తన డ్రీమ్ ప్రాజెక్ట్ అయిన 'ది గోట్ లైఫ్: ఆడుజీవితం'ను ఒకేసారి మలయాళంతో పాటు బహు భాషల్లో రిలీజ్ చేస్తున్నాడు. అందులో తెలుగు వెర్షన్ కూడా ఉంది. దీన్ని ప్రమోట్ చేసే విషయంలో పృథ్వీరాజ్ ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాడు. హైదరాబాద్‌కు తన టీంతో విచ్చేసి అనేకమంది సినీ ప్రముఖులకు స్పెషల్ షో వేయడమే కాక.. ప్రెస్ మీట్ పెట్టాడు. అలాగే మీడియాకు వన్ టు వన్ ఇంటర్వ్యూలు కూడా ఇచ్చాడు. హీరోయిన్ ను సీక్రెట్ గా పెళ్ళి చేసుకున్న హీరో సిద్ధార్థ్! ఐతే 'సలార్'లో తాను స్క్రీన్ చేసుకున్న ప్రభాస్‌నే పిలిచి ప్రమోషన్లకు ఉపయోగించుకుని ఉంటే సినిమాకు బాగా ఉపయోగపడేదనే అభిప్రాయం చాలామందిలో వ్యక్తమైంది. ఇదే విషయం ఓ ఇంటర్వ్యూలో అడిగితే.. పృథ్వీరాజ్ ఇచ్చిన సమాధానం విని హ్యాట్సాఫ్ అనకుండా ఉండలేరు. "నేను ప్రభాస్‌ను పిలిస్తే అతను నో చెప్పలేడు. కచ్చితంగా ప్రమోషనల్ ఈవెంట్‌కు వస్తాడు. కానీ అతను నో అనలేడు కాబట్టే నేను తనను పిలవలేను. స్నేహం ఉంది కదా అని మొహమాటపెట్టి సినిమాల ప్రమోషన్ల కోసం వాడుకోకూడదు. ఇప్పుడే కాదు.. నేనెప్పుడు ప్రభాస్‌ను నా సినిమా ప్రమోషన్ కోసం పిలవను. నేనొక మంచి సినిమా చేశాను. దాన్ని ప్రమోట్ చేయడానికి మీడియా, ప్రేక్షకులు చాలు. సినిమా నచ్చితే ప్రేక్షకులు చూస్తారు" అని పృథ్వీరాజ్ చక్కటి సమాధానం చెప్పాడు. 'ది గోట్ లైఫ్' ఈ గురువారమే ప్రేక్షకుల ముందుకు వస్తోంది.

# సుగుణసుందరి అవతారం



అవును.. ఇది సడెన్ ట్విస్ట్.. ఊహించని ట్విస్ట్.. వరుసగా కథానాయికలు వధువులుగా మారుతున్నారు. నచ్చినవాడిని పెళ్లాడేస్తున్నారు. వరుసగా కథానాయికలు వధువులుగా మారుతున్నారు. నచ్చినవాడిని పెళ్లాడేస్తున్నారు. కానీ చాలా కాలంగా తమన్నా పెళ్లి గురించి అడిగితే దాటవేస్తోంది. ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదు. తన ప్రియుడు విజయ్ వర్మతో డేట్ గురించి మాత్రమే మాట్లాడుతోంది కానీ, పెళ్లి గురించి ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. చూస్తుంటే ఇక తమన్నాకు కూడా లగ్గం పెట్టే సమయం ఆసన్నమైందని నెటిజనుల్లో గుసగుస ఆగడం లేదు. అయితే ఇంతలోనే ఒక సడెన్ ట్విస్ట్. తమన్నా వధువుగా మారింది. బ్రైడల్ దుస్తుల్లో ఫోటోషూట్ లో పాల్గొంది. ప్రస్తుతం ఈ ఫోటోగ్రాఫ్స్ అంతర్జాలంలో దుమారం రేపుతున్నాయి. అయితే తమన్నా నిజంగానే పెళ్లికూతురు అవుతోందా? అంటూ అభిమానులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. తమన్నా పెళ్లికూతురు అయిన మాట నిజమే కానీ, ఇది కేవలం డిజైనర్ షో కోసం మాత్రమే. ఇది కేవలం ఒక అందమైన డిజైనర్ ఫోటోషూట్. ప్రఖ్యాత డిజైనర్ రాహుల్ మిశ్రా రూపొందించిన బ్రైడల్ డిజైనర్ దుస్తుల్లో తమన్నా ముగ్ధ మనోహర రూపం కట్టి పడేస్తోంది. రకరకాల డిజైనర్ దుస్తుల్లో తమన్నా వధువు అవతార్ మతులు చెడగొడుతోంది. ఇందులో ఒక ఫోటోగ్రాఫ్ లో తమన్నా మత్స్యకన్య అవతారంలోను కనిపించింది. ఈ లుక్ నిజంగా స్టన్నింగ్. నేలమీదికి జాలువారుతూ పొడవాటి డిజైనర్ లెహంగాలో తమన్నా విరహాన్ని ప్రదర్శిస్తున్న మరో ఫోటోగ్రాఫ్ కూడా వేడి పెంచుతోంది. వీటికి భిన్నంగా బుట్ట బొమ్మ అవతారంలో భారీతనం నిండిన డిజైనర్ ఫ్లోరల్ టాప్ లోను తమన్నా ఎంతో అందంగా కనిపించింది. ఈ ఫోటోషూట్ లో తమన్నా బెస్ట్ గెటప్స్ యూత్ ని ఆకర్షిస్తున్నాయి. మరోవైపు తమన్నా కెరీర్ పరంగా సెలక్టివ్ గా ముందుకు సాగుతోంది. కెరీర్ మ్యాటర్ కి వస్తే తమన్నా ఓదెలా 2లో నటిస్తోంది. ఇటీవల మహా శివరాత్రి 2024 నాడు తమన్నా నటిస్తున్న చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైంది. హర్ హర్ మహాదేవ్! హ్యాపీ మహా శివరాత్రి అంటూ పోస్టర్ కి క్యాప్షన్ ని కూడా ఇచ్చింది తమన్నా. పోస్టర్‌లో తమన్నా సాధువు అవతారంలో కనిపించి ఆశ్చర్యపరిచింది. ఒక చేతిలో పవిత్రమైన శంఖం .. మరో చేతిలో డ్రమ్‌ని పట్టుకుని వింతగా కనిపించింది.

రెండే రెండు సినిమాలతో పాన్ ఇండియా లెవెల్‌లో ఫేమస్ అయ్యారు తెలుగు దర్శకుడు సందీప్ రెడ్డి వంగా రెండే రెండు సినిమాలతో పాన్ ఇండియా లెవెల్ లో ఫేమస్ అయ్యారు తెలుగు దర్శకుడు సందీప్ రెడ్డి వంగా. అర్జున్ రెడ్డి, యానిమల్ మూవీలతో ఓ రేంజ్ లో గుర్తింపు సంపాదించుకున్నారు. అర్జున్ రెడ్డి సినిమాను బాలీవుడ్ లో కబీర్ సింగ్ పేరుతో రీమేక్ అక్కడ కూడా బ్లాక్ బస్టర్ హిట్ కొట్టారు. ఇటీవల యానిమల్ సినిమాతో సందీప్ రెడ్డి వంగా ఎలాంటి సంచలనం సృష్టించారో అందరికీ తెలిసిందే. బాలీవుడ్ స్టార్ నటుడు రణబీర్ సింగ్, నేషనల్ క్రష్ రష్మిక మందన్న హీరోహీరోయిన్లుగా నటించిన ఈ సినిమా..

# ఇప్పుడు ప్రొడ్యూసర్‌గా...



వరల్డ్ వైడ్‌గా రూ.900 కోట్లకుపైగా రాబట్టింది. ఇండియన్ బాక్సాఫీస్ వద్ద అనేక రికార్డులు కొల్లగొట్టింది. మేకర్స్‌కు రూ. కోట్లలో లాభాలు తెచ్చిపెట్టింది. సినిమా విషయంలో అనేక విమర్శలు వచ్చినా.. తగ్గేదేలే అంటూ దూసుకెళ్లింది. ఆ తర్వాత ఓటీటీలోకి కూడా వచ్చి రికార్డులు తిరగరాసింది. ఇక సందీప్ నెక్స్ట్ సినిమాలపై అందరి దృష్టి పడింది. ఆయన లైనప్ మామూలుగా లేదు. స్టార్ హీరోలతో వర్క్ చేయనున్నారు. పాన్ ఇండియా హీరో ప్రభాస్ తో స్పిరిట్ మూవీ తీయనున్నారు. అందుకు సంబంధించిన స్క్రిప్ట్ పై ప్రస్తుతం వర్క్ చేస్తున్నారు. ఈ సినిమాపై ఇప్పటికే మూవీ లవర్స్ లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తో కూడా సినిమా చేయనున్నారు. అయితే సందీప్.. ఇప్పుడు తెలుగు చిత్రాలను నిర్మించే ఆలోచనలో ఉన్నారట. అందుకు గాను హైదరాబాద్ లో ఓ ఆఫీస్ కూడా ఇటీవల స్టార్ట్ చేశారట. స్క్రిప్టులను పరిశీలించడానికి ఓ స్పెషల్ టీమ్ ను కూడా ఏర్పాటు చేశారట. సందీప్ రెడ్డి వంగా ఫైనల్ చేశాకే.. ఆ స్క్రిప్ట్ ఓకే అవుతుందట. టాలీవుడ్ కు అనేక మంది యంగ్ అండ్ టాలెంటెడ్ డైరెక్టర్లను పరిచయం చేయాలనే ఉద్దేశ్యంతో ఇలా చేస్తున్నారట. ఇప్పటి వరకు ఇంకా ఒక్క స్క్రిప్ట్ కూడా సందీప్ రెడ్డి వంగా ఓకే చేయలేదట. కానీ 2024 ముగిసేలోపు రెండు తెలుగు సినిమాలు ప్రకటించాలని ఫిక్స్ అయ్యారట. అందుకు తగ్గట్లు ప్లాన్ చేస్తున్నారట. త్వరలోనే సందీప్ స్పిరిట్ మూవీ షూటింగ్ స్టార్ట్ చేయనున్నారట. అయితే అక్టోబర్ లో షూటింగ్ మొదలవుతుందనుకున్నా.. కొద్ది రోజులు లేట్ అవ్వొచ్చని తెలుస్తోంది. మరి సందీప్ నిర్మాతగా తొలి మూవీ ఎప్పుడు ప్రకటిస్తారో చూడాలి.

# జరగండి పాటకు అన్నీ కోట్లు ఖర్చు చేశారా?



కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో రామ్ చరణ్.. గేమ్ ఛేంజర్ మూవీ చేస్తున్న విషయం తెలిసిందే. కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో రామ్ చరణ్.. గేమ్ ఛేంజర్ మూవీ చేస్తున్న విషయం తెలిసిందే. స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం చివర దశలో ఉంది. ఎప్పుడో మూడేళ్ల క్రితం పట్టాలెక్కిన ఈ మూవీ.. ఇప్పటికీ షూటింగ్ జరుపుకుంటూనే ఉంది. అప్పుడెప్పుడో టైటిల్ అనౌన్స్మెంట్, ఫస్ట్ లుక్ రిలీజ్ చేసిన మేకర్స్.. తాజాగా చెర్రీ పుట్టిన రోజు నాడు మరో అప్డేట్ ఇచ్చారు. గత ఏడాది దీపావళికి రిలీజ్ చేస్తామని ప్రకటించిన జరగండి సాంగ్‌ను నేడు రిలీజ్ చేశారు గేమ్ ఛేంజర్ మేకర్స్. తమన్ సంగీతం అందించిన ఈ సాంగ్.. గతంలో సోషల్ మీడియాలో లీక్ అయిన విషయం తెలిసిందే. అప్పుడు వేరే సింగర్స్ తో పాడించిన ఈ సాంగ్‌ను ఇప్పుడు.. దలేర్ మెహింది, సునీత చౌహన్ తో తమన్ పాడించారు. ఈ లిరికల్ సాంగ్‌లో హీరోహీరోయిన్లు రామ్ చరణ్, కియారా అద్వానీ స్టైలిష్‌గా స్టెప్పులు వేసి అదరగొట్టారు. అయితే జరగండి జరగండి పాటకు ప్రముఖ డ్యాన్స్ మాస్టర్ ప్రభుదేవా కొరియోగ్రఫీ చేశారు. ఈ సాంగ్ కు మేకర్స్.. ఏకంగా రూ.16 కోట్లు నుంచి రూ.18 కోట్లు ఖర్చు చేశారని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ఇక పాట బ్యాక్ గ్రౌండ్ లో కనిపిస్తున్న కలర్ ఫుల్ భవనాలు సెట్సే కానీ.. ఒరిజినల్ లొకేషన్స్‌లా అనిపిస్తున్నాయి. సెట్స్ తోపాటు గ్రాఫిక్స్ కోసమే భారీ మొత్తంలో మేకర్స్ ఖర్చు పెట్టినట్లు తెలుస్తోంది. శంకర్ చేస్తున్న ఫస్ట్ తెలుగు మూవీ గేమ్ ఛేంజర్ కావడం గమనార్హం. ఇప్పటికే భారతీయుడు, ఒకే ఒక్కడు వంటి పలు డబ్బింగ్ సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువయ్యారు శంకర్. వినయ విధేయ రామ సినిమా తర్వాత మరోసారి రామ్ చరణ్ చరణ్, కియారా జంటగా ఈ మూవీలో యాక్ట్ చేస్తున్నారు. దాదాపు రూ. 200 కోట్ల బడ్జెట్ తో ఈ సినిమాను దిల్ రాజు నిర్మిస్తున్నట్లు సమాచారం. శంకర్ తెరకెక్కిస్తున్న ఈ పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ లో రామ్ చరణ్.. డ్యూయల్ రోల్ లో నటిస్తున్నారు. ఐపీఎస్ ఆఫీసర్ గా చరణ్ కనిపించబోతున్నట్లు సమాచారం. సెప్టెంబర్ లో ఈ మూవీ రిలీజ్ చేస్తామని ఇప్పటికే దిల్ రాజు... ప్రకటించారు. కానీ అఫీషియల్ అప్డేట్ మాత్రం ఇప్పటి వరకు రాలేదు. ఈ మూవీ ఓటీటీ హక్కులను అమెజాన్ ప్రైమ్ వీడియో దక్కించు కున్న విషయం



కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతున్న దేవర సినిమా పై జాన్వీ కపూర్ చాలా ఆశలు పెట్టుకుని ఎదురు చూస్తుంది.అతిలోక సుందరి శ్రీదేవి నట వారసురాలు జాన్వీ కపూర్ హీరోయిన్‌గా వరుస సినిమాలను టాలీవుడ్ లో చేసేందుకు రెడీ అవుతుంది. ఇప్పటికే ఎన్టీఆర్ తో దేవర సినిమాలో నటిస్తున్న విషయం తెల్సిందే. కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతున్న దేవర సినిమా పై జాన్వీ కపూర్ చాలా ఆశలు పెట్టుకుని ఎదురు చూస్తుంది.మరో వైపు రామ్ చరణ్ కు జోడీగా బుచ్చిబాబు దర్శకత్వంలో జాన్వీ కపూర్ సినిమా చేస్తుంది. ఇటీవలే ఆ సినిమా పూజా కార్యక్రమాలు జరిగాయి. అందులో జాన్వీ పాల్గొనడం జరిగింది. తెలుగు లో రెండు సినిమాల్లో నటించడంతో పాటు మరో స్టార్ హీరో సినిమాలో ఐటెం సాంగ్ చేయబోతుందనే వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే దేవర సినిమా షూటింగ్ లో పాల్గొన్న జాన్వీ కపూర్ మళ్లీ ఎప్పుడెప్పుడు ఎన్టీఆర్ తో కలిసి సెట్స్‌లో అడుగు పెడతామా అంటూ ఎదురు చూస్తున్నట్లు పేర్కొంది. దేవరలో మళ్లీ తంగ పాత్ర చిత్రీకరణ కోసం ఇక ఏమాత్రం వేచి ఉండలేక పోతున్నాను అంటూ తన

# ఆగలేకపోతున్నా అంటున్న జాన్వీ

ఇన్ స్టాలో పేర్కొంది. ఎన్టీఆర్ తో కలిసి జాన్వీ కపూర్ చేస్తున్న దేవర సినిమా అక్టోబర్ లో విడుదల అవ్వబోతుంది. దేవర రెండు పార్ట్ లుగా రాబోతున్న విషయం తెల్సిందే. మొదటి పార్ట్ అక్టోబర్ లో విడుదల అవ్వనుండగా, రెండో పార్ట్ 2025 చివర్లో విడుదల అయ్యే అవకాశాలు ఉన్నాయి.ఇక రామ్ చరణ్ తో జాన్వీ కపూర్ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఈ సమ్మర్ లోనే ప్రారంభం అయ్యే అవకాశాలు ఉన్నాయి. శ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం రెండు సినిమాల్లో కూడా జాన్వీను అందమైన పల్లెటూరు అమ్మాయిగా చూడబోతున్నాం. హిందీలో ఇప్పటి వరకు దక్కని కమర్షియల్ హిట్ తెలుగు సినిమాలతో దక్కించుకుంటాను అనే నమ్మకంతో జాన్వీ కపూర్ కనిపిస్తుంది. తెలుగులో నటిస్తూనే మరో వైపు బాలీవుడ్ సినిమాల్లో కూడా ఈ అమ్మడు నటిస్తూ ఉంది.

# పెళ్ళి చేసుకున్న హీరో సిద్ధార్థ్!



బొమ్మరిల్లు హీరో సిద్ధార్థ్, హీరోయిన్ అదితి రావు హైదరీ పెళ్ళి చేసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. బొమ్మరిల్లు హీరో సిద్ధార్థ్, హీరోయిన్ అదితి రావు హైదరీ పెళ్ళి చేసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. తెలంగాణ లోని వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్‌లో బుధవారం (మార్చి 27) ఉదయం వీరి వివాహం జరిగినట్లుగా ప్రచారం జరుగుతోంది. శ్రీ రంగనాయకస్వామి ఆలయంలో గోప్యంగా జరిగిన ఈ వేడుకకు కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు బంధు మిత్రులు మాత్రమే హాజరైనట్లుగా కథనాలు వస్తున్నాయి. సిద్ధార్థ్ సూర్యనారాయణన్ – అదితి రావు హైదరి లివ్‌ఇన్ రిలేషన్‌షిప్‌లో ఉన్నారని, త్వరలోనే పెళ్ళి చేసుకోబోతున్నారని చాలా కాలంగా పుకార్లు షికార్లు చేస్తున్నాయి. 2021లో 'మహా సముద్రం' చిత్రంలో కలిసి నటించిన సమయంలో వీరి మధ్య సాన్నిహిత్యం ఏర్పడిందని, చివరకు అది ప్రేమగా మారిందని బీ టౌన్ కోడై కూసింది. వీటిని సిద్ధార్థ్ – అదితి ఖండించకపోవడం, ఇద్దరూ ప్రేమ పక్షుల్లా తరచుగా చెట్టాపట్టాలేసుకొని తిరగడంతో ఈ జంట మధ్య వ్యవహారం నిజమేనని అందరూ ఫిక్స్ అయ్యారు. ఈ నేపథ్యంలోనే తాజాగా పెళ్ళి కూడా చేసుకున్నారని వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. అయితే పెళ్ళి గురించి ఇప్పటి వరకూ అటు సిద్ధార్థ్ కానీ, ఇటు అదితిరావు కానీ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. నిజానికి హీరో సిద్ధార్థ్ కు గతంలో మేఘనా అనే అమ్మాయితో వివాహమైంది. కానీ వీరు నాలుగేళ్లకే విడాకులు తీసుకున్నారని టాక్. మరోవైపు అదితి రావు హైదరీకి కూడా 21 ఏళ్లకే పెళ్ళి జరిగింది. సత్యదీప్ మిశ్రా అనే బాలీవుడ్ నటుడిని ఆమె వివాహమాడింది. ఒక బాబుకు జన్మనిచ్చిన తర్వాత వీరిద్దరూ విడిపోయారు. అప్పటి నుంచీ ఒంటరి జీవితం గడుపుతోన్న అదితిపై అనేక డేటింగ్ రూమర్స్ వచ్చాయి. సిద్ధార్థ్ తో పరిచయం తర్వాత అదితి మరోసారి ప్రేమలో పడిందని అప్పట్లో వార్తలు వైరల్ అయ్యాయి. ఈ క్రమంలో వీరిద్దరూ హీరో శర్వానంద్ నిశ్చితార్థానికి జంటగా హాజరయ్యారు. కలిసి రీల్స్ చేస్తూ సోషల్ మీడియాలో సందడి చేశారు. ఇప్పుడు సిద్ధార్థ్ – అదితి మూడు ముళ్ళ బంధంలో అడుగుపెట్టినట్లుగా వార్తలు వినిపిస్తున్నాయి.



# చరణ్‌కి గ్రాండ్ విషెస్!

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ పుట్టిన రోజు కావడంతో అభిమానుల విషెస్‌తో సోషల్ మీడియా షేక్ అవుతోంది మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ పుట్టిన రోజు కావడంతో అభిమానుల విషెస్ తో సోషల్ మీడియా షేక్ అవుతోంది. తమదైన శైలిలో అభిమానం చాటుతూ విషెస్ తెలియజేస్తున్న పోస్టులు నెట్టింట వైరల్ అవుతు న్నాయి. ఇక సెలబ్రిటీలు... సన్నిహితులు.. స్నేహితులు అంతా చరణ్‌కి శుభాకాంక్షలు తెలియ జేస్తున్నారు. ఇక ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ అయితే బావ చరణ్‌కి ఎంతో ప్రత్యేకంగా విషెస్ తెలియజేసారు. తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో చరణ్‌తో ఉన్న ఫోటోని షేర్ చేసి హ్యాపీ బర్త్ డే అంటూ విష్ చేసారు. ఇక్కడ చరణ్ వైట్ కలర్ షర్ట్ ప్యాంట్‌లో ఉండగా..బన్నీ మాత్రం బ్లాక్ దుస్తుల్లో నవ్వుతూ కనిపిస్తున్నారు. ఇది పబ్‌లో దిగిన ఫోటో లా ఉంది. బర్త్ డ్ పార్టీ ఎంజాయ్ చేస్తోన్న సమయంలో క్యాప్చర్ చేసిన పిక్ ఇది. మరి ఈపార్టీలో ఇంకా ఎవరెవరు? ఉన్నారు? అన్నది తెలియాలి. ప్రస్తుతం ఈ పిక్ నెట్టింట వైరల్‌గా మారింది. చరణ్..బన్నీ అభిమానుల్ని విపరీతంగా ఆకట్టుకుంటుంది. బావ–బామ్మర్ది ఇద్దరు ఒకే ప్రేమ్‌లో అంటూ ఫన్నీ కామెంట్లు పోస్ట్ చేస్తున్నారు. నేడు ఇద్దరు పాన్ ఇండియా స్టార్లే! కదా మరి ఆ ఇద్దరు కలిసి సినిమా చేసేది? ఎప్పుడంటూ ఓ నెటిజనుడు పోస్ట్ చేసాడు. వాళ్లిద్దరు కలిసి నటించాలని అల్లు అరవింద్ కూడా అంతే కోరుకుంటున్నారు. ఇద్దరి కోసం ఇప్పటికే చరణ్–అర్జున్ అంటూ ఓ టైటిల్ కూడా రిజిస్టర్ చేయించిన సంగతి తెలిసిందే. ఆ కాంబినేషన్‌ని అరవింద్ గారే నిర్మిస్తే అంతకు మించిన సంతోషం ఏముంటుంది. విషెస్ సంగతి చూస్తే టాలీవుడ్ నుంచి పవన్ కళ్యాణ్, ఎన్టీఆర్ సహా పలువురు సెలబ్రిటీలు విషెస్ తెలియజేసారు. రామ్ చరణ్ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని.. ఎంత ఎదిగిన ఒదిగి ఉంటాడని.. పెద్ద వారి పట్ల.. సాంప్రదాయ పద్ధతులు పట్ల చాలా గౌరవంగా వ్యవహరిస్తాడని.. ప్రతి విషయంలోనూ విద్యార్థిలా నడుచు కుంటాడన్నారు. ఇవే తనకి శ్రీరామ రక్ష అని పవన్ అభిప్రాయపడ్డారు. చరణ్ శ్రీవారిదర్శనంలో ఉన్నసంగతి తెలిసిందే.

# పిలిస్తే ప్రచారం చేస్తా..



పవన్ కళ్యాణ్ పిలిస్తే జనసేన పార్టీకి ప్రచారం చేస్తానని అన్నారు యాంకర్ అనసూయ భరద్వాజ్. మెగా అభిమానుల్ని, జన సైనికుల్ని ప్రసన్నం చేసుకునే వార్త చెప్పింది అనసూయ భరద్వాజ్. సొసైటీపై సినిమా ప్రభావం ఎక్కువగా ఉంటుందని.. కాబట్టి సొసైటీలో ఉంటున్న తనకీ ఓ మంచి నాయకుడ్ని ఎన్నుకునే బాధ్యత ఉందని.. కాబట్టి తాను చెప్తే వినేవాళ్లు ఉండటం తన అదృష్టం అని అన్నారు అనసూయ.తాజా ఇంటర్వ్యూలో అనసూయ మాట్లాడు తూ.. 'ఇది వివాదం అవ్వొచ్చు కానీ.. అడిగారు కాబట్టి చెప్తున్నా. నేను తప్పై ఉండొచ్చు. నాకు లీడర్స్‌తోనే పని. పొలిటికల్ పార్టీలతో కాదు. పవన్ కళ్యాణ్ గొప్ప నాయకుడు. ఆయన ప్రచారం చేయమని పిలిస్తే తప్పకుండా వెళ్తాను. జబర్దస్త్‌లో రోజా, నాగబాబు ఇద్దరితో కలిసి పనిచేశాను. నాకు నాగబాబు గారు బాగా క్లోజ్. ఒకవేళ అటు నుంచి రోజా గారూ.. ఇటు నుంచి నాగబాబు గారూ పార్టీలోకి పిలిస్తే.. వాళ్లు ఇద్దరూ పిలుపునిస్తే.. ఆ రెండు పార్టీల్లోకి వెళ్తాను. కానీ అది నా జాబ్ కాదు. నేను ఏది నమ్ముతానంటే.. నా అజెండాని బట్టి నేను సపోర్ట్ చేస్తాను. నాకు రాజకీయాలంటే ఇష్టం లేదు. మా నాన్న గారు రాజకీయాల్లో ఉండేవారు. ఆయన పాలిటిక్స్ మానేయడానికి కారణం నేనే. మంచి లీడర్‌ని ఎన్నుకోమని నేనే వేరే వాళ్లకి చెప్పడం వాళ్లు నా వినడం అది నా అదృష్టం. నేను చెప్తే వింటారు కాబట్టి.. కరెక్ట్‌గా చెప్పాలి. నేను చెప్తే వింటారని ఏది పడితే అది చెప్పడం తప్పు. సినిమా అనేది చాలా ఇంపాక్ట్ చేస్తుంది. ఒకవేళ జనసేన నుంచి ప్రచారం చేయమని అడిగితే తప్పకుండా వెళ్తాను. పవన్ కళ్యాణ్ మంచి లీడర్ కాబట్టి.. ఆయన పిలిస్తే నేను వెళ్తాను. నేను వెళ్తే మాత్రం తెలుసుకునే వెళ్తాను' అంటూ తన పొలిటికల్ ఎంట్రీ గురించి చెప్పుకొచ్చారు యాంకర్ అనసూయ.